# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 10-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 37 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ , సెప్టెంబర్ 9: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు వినాయక చవితిశుభాకాంక్షలు తెలిపారు. తలపెట్టిన కార్యాలు ఆటంకాలు లేకుండా విజయవంతమవ్వాలని గణనాథున్ని పూజిస్తారని, విఘ్నాలు తొలగించే దైవంగా హిందూ సాంప్రదాయంలో వినాయకునికి అత్యంత ప్రాధాన్యతవున్నదని సీఎం తెలిపారు.పిల్లల నుంచి పెద్దల దాకా అత్యంత భక్తి శ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకునే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా జరుపుకోవాలని సీఎం ప్రజలకు పిలుపునిచ్చారు. తొమ్మిది రోజుల పాటు సాగే ఉత్సవాలు సహా, నిమజ్జనం సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సుఖశాంతులను అందించాలని, రాష్ట్ర ప్రగతి ప్రస్థానానికి విఘ్నాలు రాకుండా చూడాలని పార్వతీ తనయుడు గణనాథున్ని సీఎం కేసీఆర్ వేడుకున్నారు.

# ఖైరతాబాద్ మహాగణపతికి 60 అడుగుల కండువా..



హైదరాబాద్ , సెప్టెంబర్ 9:దేశంలోనే ప్రాచుర్యం పొందిన ఖైరతాబాద్ మహాగణపతి రేపటి నుంచి పూజలకు సిద్ధమయ్యాడు. ఈసారి కూడా మహాగణపతికి 60 అడుగుల కండువా, జంధ్యం, పట్టు వస్త్రాలను అందజేయనున్నట్లు ఖైరతాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు శ్రీధర్, గౌరవ అధ్యక్షులు కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఏలె స్వామిలు తెలిపారు. బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 40 రోజుల పాటు నైపుణ్యం కలిగిన కళాకారుల చేత వీటిని తయారుచేయించినట్లు తెలిపారు. వినాయకచవితి రోజు ఉదయం 7 గంటలకు రాజ్‌దూత్ చౌరస్తా నుంచి కళాకారుల బృందంతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి సమర్పించనున్నట్లు వారు తెలిపారు.

## 7 రాష్ట్రాలకు రూ.9,871 కోట్ల నిధులు రిలీజ్!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:కేంద్ర ప్రభుత్వం రెవెన్యూ లోటు పరిహారం కింద 17 రాష్ట్రాలకు రూ.9,871 కోట్లు విడుదల చేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. పన్ను చట్టాల వికేంద్రీకరణ తర్వాత రాష్ట్రాలకు వచ్చే ఆదాయం లోటును ప్రతి నెలా భర్తీ చేయాలని 15వ ఆర్థిక సంఘం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు రూ.59,226 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వ్యయ విభాగం తెలిపింది.

ఈ నిధులు అందుకునే రాష్ట్రాలివి: ఆంధ్రప్రదేశ్, అస్సాం, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, కేరళ, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17 రాష్ట్రాలకు రూ.1,18,452 కోట్ల పరిహారం విడుదల చేయాలని 15వ ఆర్థిక సంఘం కేంద్రానికి సిఫారసు చేసింది.

# మంత్రిగా ఒక్క ఇల్లు కట్టనోడు.. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా కడుతడా? : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్ , సెప్టెంబర్ 9: హుజూరాబాద్‌లో ఉప ఎన్నిక వ్యక్తి స్వార్థం వల్ల వచ్చిందని.. ఈ ఎన్నికల్లో వ్యక్తి గెలువాలా? ప్రజలు గెలువాలా? ఆలోచించాలని మంత్రి హరీశ్‌రావు ప్రజలకు సూచించారు. ఈటల రాజేందర్ ఎన్నికల్లో గెలిచి మంత్రి అవుతడా?.. మంత్రిగా ఉండి పేదలకు ఇండ్లు కట్టివ్వని ఆయన.. గెలిచినంక ప్రతిపక్ష ఎమ్మెల్యేగా కడుతడా? అంటూ ప్రశ్నించారు. జమ్మికుంటలో జరిగిన విశ్వకర్మ సభలో మంత్రి పాల్గొన్నారు.

కార్యక్రమంలో శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనచారి పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌కే మద్దతిస్తామని విశ్వకర్మలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వకర్మలకు వృత్తి కష్టమవుతోందని, ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. విశ్వకర్మలకు పోలీసుల వేధింపులు లేకుండా సీఎం కేసీఆర్ ఆదేశాలిచ్చారన్నారు. వడ్రంగుల్లోనూ కొంత ఇబ్బందులున్నాయని, వారికి కర్ర దొరకడం లేదని, ఈ విషయంలో సీఎంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు కోరుతున్నారని, ఈ విషయం సీఎం మనసులో ఉందని.. ఒక్కొక్కటికి అమలు చేస్తున్నారన్నారు. 18 నెలలు కరోనాతో రాష్ట్ర ఆదాయం దెబ్బతిన్నదని, సీఎంకు అందరికీ సమానమేనని.. అన్ని కులాలు, మతాలను ఆయన సమానంగా చూస్తారన్నారు. విశ్వకర్మల వృత్తి దెబ్బతిన్నదని, రాబోయే రోజుల్లో సీఎం సమస్యలు పరిష్కరిస్తారని, విశ్వకర్మ కార్పొరేషన్‌కు నిధులు ఇచ్చి బలోపేతం చేస్తారన్నారు.

సీఎం కేసీఆర్ పోచారం, జగదీశ్‌రెడ్డి, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్‌కు, తనకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించారని, మే అందరం ఇండ్లు నిర్మించి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించామన్నారు. హుజూరాబాద్‌లో మాత్రం ఈటల ఒక్క ఇల్లు కట్టలేదని, ఒక్కరినీ ఇండ్లలోకి పంపలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ లేదని, డిపాజిట్ కూడా రాదన్నారు. ఇక్కడ పోటీ టీఆర్ఎస్, బీజేపీ మధ్యేనన్నారు. ఓటు బీజేపీకి వేస్తే హుజూరాబాద్‌కు ప్రయోజనామా? టీఆర్ఎస్‌కు వేస్తే ప్రయోజనమా? ఆలోచించాలన్నారు.

### సెంటిమెంట్లు పనికి రావు..

తాము ఆడపిల్లల కల్యాణలక్ష్మి, రైతులకు ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, లక్ష రుణమాఫీతో పాటు పలు పథకాలు అమలు చేస్తూ ఓట్లు అడుగుతున్నామన్నారు. బీసీ వర్గాలకు, పేదలకు, విశ్వకర్మలకు సాయం చేస్తామని చెబుతున్నామని.. బీజేపీ హుజూరాబాద్‌లో ఏం చెబుతారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచాం.. విమానాలు, నౌకాశ్రయాలు, రైళ్లు.. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్ముతం.. బీఎస్ఎన్ఎల్ అమ్మేశాం.. ప్రైవేటు రంగ సంస్థల్లో రిజర్వేషన్లు పోతయ్.. అందుకు ఓటేయమని అడుగుతున్నారా? అంటూ ప్రశ్నించారు. బండి సంజయ్ గెలిచాక ఒక్క ఊర్లో, మండలంలో పది లక్షల పని జరిగిందా? ఎంపీగా బండి ఏమీ చేయలేదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఈటల గెలిచి పని చేస్తారా? ఆలోచించాలన్నారు.

### 16న విశ్వకర్మల ఫంక్షన్ హాలుకు శంకుస్థాపన

సిద్దిపేటలో ఆచార్య జయశంకర్ సార్ పేరిట విశ్వకర్మలకు భవనం నిర్మించినట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. హుజూరాబాద్‌లో ఎకరం స్థలం, కోటి రూపాయలతో భవనం అడిగితే ఇచ్చామని, అలాగే జమ్మికుంటలో అడిగితే మంజూరు చేసినట్లు చెప్పారు. హుజూరాబాద్‌లో ఈటల ఒక్క భవనమైనా నిర్మించారా ఆలోచించాలన్నారు. 16న హుజూరాబాద్‌లో విశ్వకర్మల ఫంక్షన్ హాలుకు శంకుస్థాపన కార్యక్రమం, విశ్వకర్మ గర్జన పెట్టుకొని.. విశ్వకర్మల ఐక్యతను తెలియజేద్దామని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్‌ను సంప్రదించి సొంత స్థలాలు ఉన్న వారు ఇండ్లు కట్టుకునే కార్యక్రమం చేద్దామన్నారు.

హుజూరాబాద్ సంక్షేమం కోసం టీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేతలవి కోతలు.. వాతలు తప్పా చేసేందిమి లేదన్నారు. సిలిండర్ ధరలను పెంచారని, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చారన్నారు. ఆ చట్టాలను రద్దు చేయాలని ఆరు నెలల కిందట ఈటల చెప్పారని, దీనిపై కొట్లాడదని చెప్పి బీజేపీలో చేరారని విమర్శించారు. నల్ల చట్టాలు తెచ్చినం, మార్కెట్ రద్దయితది.. మద్దతు ధర దొరకదు.. నాకు ఓటేయండని ఈటల ఓట్లు అడుగుతారా? అని ప్రశ్నించారు. కరోనా కట్టడిలో కేంద్రం ఫెయిల్ అయ్యిందని, గుజరాత్‌కే టీకాలు ఇస్తున్నారన్నారని టీవీల ముందు ఖండించిన వారు.. ఇవాళ ఎలా సమర్థిస్తారన్నారు.

కరోనా విషయంలో కేంద్రం ఏం లాభం చేసింది.. ఇది కేవలం తన ప్రయోజనాల కోసమే తప్ప ప్రజల ప్రయోజనం కోసం కాదు. ఇందు కోసమేనా బీజేపీలో ఈటల చేరిందని ప్రశ్నించారు. ఓ వ్యక్తి స్వార్థమా.. ఓటు అడిగే ముందు ప్రజలకు చెప్పాలి కదా.. బీజేపీలో ఎందుకు చేరారో చెప్పాల్సిన అవసరం ఈటలకు ఉందా? లేదా? ప్రశ్నించారు. తాము చేసినవన్నీ చెబుతున్నామని, మీరేం చెబుతారని ప్రశ్నించారు. గెల్లు శ్రీనివాస్‌కు వ్యాపారం లేదని, రెండుగంటల భూమి ఉన్న సామాన్యుడు ఈటెలపై గెలువనున్నాడన్నారు. ఒక్క అవకాశం ఇవ్వాలని, ఏడేళ్లలో చేయని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

## ఆఫ్ఘన్ సంక్షోభానికి శాంతియుతంగా పరిష్కారం.. బ్రిక్స్ సదస్సులో తీర్మానం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:ఆఫ్ఘనిస్థాన్ సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించాలని బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించాయి. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణ ఆఫ్రికా దేశాల సమూహం బ్రిక్స్ 13వ సదస్సు భారత్ అధ్యక్షతన గురువారం ఆన్‌లైన్‌లో జరిగింది. తాలిబన్ల ఆక్రమణతో సంక్షోభంలో ఉన్న ఆఫ్ఘనిస్థాన్‌లో హింసకు తావివ్వకూడదని, శాంతియుత మార్గాల ద్వారా పరిస్థితిని పరిష్కరించాలని బ్రిక్స్ దేశాల నేతలు పిలుపునిచ్చారు. ఆ దేశంలో స్థిరత్వం, పౌర శాంతి, శాంతిభద్రతల కోసం ఆఫ్ఘన్‌పై అంతర్గత చర్చలు జరుగాలని ఆకాక్షించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, ఉగ్రవాదుల స్థావరంగా ఆఫ్ఘన్ మారకుండా, ఇతర దేశాలపై ఉగ్ర దాడులకు పాల్పడకుండా చూడటం, సరిహద్దులో ఉగ్రవాదుల కదలికలు, టెర్రరిజం ఫైనాన్సింగ్ నెట్‌వర్క్‌ను కట్టడి చేయడం వంటివి ఢిల్లీ డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షత వహించిన బ్రిక్స్ ఆన్‌లైన్ సదస్సులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా పాల్గొన్నారు. అమెరికా, నాటో దళాల ఉపసంహరణ తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌లో కొత్త సంక్షోభం నెలకొన్నదని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. ప్రపంచం, ఈ ప్రాంత భద్రతపై ఇది ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్న దానిపై స్పష్టత లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

చైనా అధ్యక్షుడు జి జిన్ పింగ్ మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా, ఐదు బ్రిక్స్ దేశాలు సమగ్రత, సమానత్వ స్ఫూర్తితో వ్యూహాత్మక కమ్యూనికేషన్, రాజకీయ విశ్వాసాన్ని పెంపొందించుకున్నాయని అన్నారు. దేశాలు పరస్పరం సంభాషించుకోవడానికి ఒక సామాజిక వ్యవస్థ, అభివృద్ధి, మంచి మార్గాన్ని అన్వేషించాయని పేర్కొన్నారు. 'ఈ సంవత్సరం ప్రారంభం నుండి, మన ఐదు దేశాలు ఃఖీఎఆూ సహకారం యొక్క వేగాన్ని కొనసాగించాయి. అనేక రంగాలలో కొత్త పురోగతిని సాధించాయి. మన మనస్సు, ప్రయత్నాలు కలిసి ఉన్నత కాలం, బ్రిక్స్ సహకారంలో ఘనమైన పురోగతిని సాధించగలం' అని వెల్లడించారు.

బ్రిక్స్ సదస్సును ప్రారంభించిన ప్రధాని మోదీ అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాధాన్యతలపై దృష్టి కేంద్రీకరించడానికి బ్రిక్స్ ప్లాట్‌ఫాం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. 'ఈ రోజు మనం ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు ఒక ప్రభావవంతమైన స్వరం. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాధాన్యతలపై కూడా దృష్టి కేంద్రీకరించడానికి ఈ వేదిక ఉపయోగకరంగా ఉంది' అని చెప్పారు. బ్రిక్స్ 15వ వార్షికోత్సవం నేపథ్యంలో ఈ సదస్సు థీమ్‌ను 'ఃఖీఎఆూ@15: కంటిన్యూటీ, కన్సాలిడేషన్, ఏకాభిప్రాయం కోసం ఇంట్రా-బ్రిక్స్ సహకారం'గా పేర్కొన్నారు.

కాగా, ప్రధాని మోదీ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించడం ఇది రెండోసారి. 2016లో జరిగిన గోవా సదస్సుకు కూడా ఆయన అధ్యక్షత వహించారు.

# ఎలక్ట్రిక్ వాహనాలకు మరింత ప్రోత్సాహం.. : మంత్రి పువ్వాడ

హైదరాబాద్ , సెప్టెంబర్ 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తుందని, ఆ దిశగా అనేక చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్ట్రిక్ విధానానికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు.

దీంతో రాష్ట్రంలో ఈవీల కొనుగోళ్లు క్రమంగా జోరందుకొంటున్నాయని, వివిధ ఆటోమొబైల్ సంస్థలు కూడా ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలను రూపొందించే ప్రక్రియలో ఉన్నాయన్నారు.

ప్యాసింజర్ వాహన శ్రేణి ఆటోమొబైల్ సంస్థ మ్యారీస్ గ్యారేజెస్ (ఎంజీ) రూపొందించిన 7 సీటర్, 5 సీటర్ ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహనాలను ఈ మేరకు గురువారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. తెలంగాణ ఎలక్ట్రిక్ అండ్ ఎనర్జీ స్టోరేజీ పాలసీ 2020-2030లో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజును, రోడ్ ట్యాక్స్‌ను పూర్తిగా రద్దు చేశామన్నారు. దీంతో వాహనదారులు ఎలక్ట్రిక్ వాహన కొనుగోళ్లపై మక్కువ చూపుతున్నారన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 4,568 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయని, వీటిలో 3,572 ద్విచక్రవాహనాలు ఉన్నాయని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం రూ.19.93 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చినట్టు వెల్లడించారు. ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ సూచనల మేరకు పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని విస్తృత స్థాయిలో ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఎలక్ట్రిక్ వాహన శ్రేణిలో అడుగుపెట్టిన ఎంజీ సంస్థ ప్రతినిధులకు, సిబ్బందికి మంత్రి పువ్వాడ శుభాకాంక్షలు తెలిపారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మంచిర్యాల, సెప్టెంబర్ 9: : పంట నష్టపోయిన రైతులను పూర్తి స్థాయిలో ఆదుకుంటామని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ముంపునకు గురైన పంట పొలాలను క్షేత్ర స్థాయిలో విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పరిశీలించారు. రైతులతో మాట్లాడిన అనంతరం మంచిర్యాల జిల్లా వరదలపై శ్రీరామ్ పూర్ గెస్ట్ హౌస్‌లో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ..వరద ప్రభావం, పంట నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. రైతులను పూర్తి స్థాయిలో ఆదుకుంటామని పేర్కొన్నారు.ఇప్పటికే నష్ట పరిహారం విషయంపై సోమవారం (సెప్టెంబర్ 8) న ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావుకు వినతిపత్రం అందించాం. నియోజకవర్గంలోని కోటపల్లి, చెన్నూర్, జైపూర్ మండలాల్లో 5,545 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు.

సమస్య తీవ్రతను ముఖ్యమంత్రికి వివరించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పైన అక్కసు వెలిబుచ్చడానికే విపక్షాలు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఇకనైనా రాజకీయాలు పక్కన బెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని హితవు పలికారు.

వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ వ్యవస్థ ఎప్పటికప్పుడు అధికారులు మరమ్మతులు చేయాలి. సీజనల్ వ్యాధులు, కరోనాలపై అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు తగు జాగ్రత్తలు సూచనలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ భారతీ హ్వెళికేరీ, వెంకటేశ్వర్లు ( ఈఎన్ సీ కాళేశ్వరం ప్రాజెక్ట్), ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## జమ్ముకశ్మీర్‌పై అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్ష

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం సమీక్షించారు. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆర్మీ చీఫ్ ఎంఎం నరవాణే, జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ దోవల్, రా కార్యదర్శి సామంత్ గోయల్, సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ కుల్‌దీప్ సింగ్, బీఎస్ఎఫ్ చీఫ్ పంకజ్ సింగ్‌తోపాటు భద్రతా సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జమ్ముకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు, అభివృద్ధికి సంబంధించిన సమస్యలు, సరిహద్దులో సైనిక సంసిద్ధతపై అమిత్ షా వారితో చర్చించినట్లు వెల్లడించాయి.

కాగా, ఆఫ్ఘనిస్థాన్‌ను తాలిబన్ స్వాధీనం చేసుకున్న తర్వాత నార్త్ బ్లాక్‌లో ఇటువంటి అత్యున్నత స్థాయి సమావేశం జరుగడం ఇదే తొలిసారి. ఆఫ్ఘన్‌లో పరిణామాల నేపథ్యంలో దక్షిణ కాశ్మీర్‌లోని అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా సోపోర్, షోపియాన్, డౌన్‌టౌన్ శ్రీనగర్ నగరంలో రాడికలైజేషన్ పెరుగుతున్నట్లు కేంద్రానికి నిఘా వర్గాల సమాచారం అందింది. సుమారు 82 మంది కనిపించడం లేదని, వారంతా తమ ఇండ్లను వీడి ఉగ్రవాద సంస్థల్లో చేరినట్లు తెలుస్తున్నది.మరోవైపు ఈ ఏడాది తొలి ఎనిమిది నెలల్లో 120 మంది ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టగా ఇందులో పది శాతం మంది స్థానికులేనని అధికారులు వెల్లడించారు. జైష్ , లష్కర్, అల్ బద్ర్ ఉగ్రవాద సంస్థలకు చెందిన సుమారు 200 మంది లోకల్స్ కశ్మీర్ లోయలో క్రియాశీలకంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కశ్మీర్ వేర్పాటువాది సయ్యద్ అలీ షా గీలాని మరణం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ఆందోళన రేకెత్తించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం ఈ కీలక సమావేశం నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

## మాతా వైష్ణోదేవి ఆలయంలో రాహుల్ పూజలు

శ్రీనగం, సెప్టెంబర్ 9:: జమ్ము కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గురువారం కత్రా నుంచి కాలినడకన మాతా వైష్ణోదేవి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. ఈరోజున ఆలయ ప్రాంగణంలో ఆయన బస చేయనున్నారు. మాతకు పూజలు చేసేందుకే తాను ఇక్కడకు వచ్చానని, ఇక్కడ తాను ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయబోనని రాహుల్ పేర్కొన్నారు.

ఈ అలయం పట్ల రాహుల్‌కు ప్రత్యేక విశ్వాసం ఉందని, కొన్నేండ్లుగా ఆయన ఇక్కడకు రావాలని కోరుకుంటున్నారని జమ్ము కశ్మీర్ కాంగ్రెస్ చీఫ్ గులాం అహ్మద్ మిర్ చెప్పారు. రాహుల్ శుక్రవారం కాలినడకనే కిందికి దిగుతారని తెలిపారు. మాతా వైష్ణోదేవి పట్ల రాహుల్‌కు ప్రత్యేక విశ్వాసం ఉన్నందున తొలిరోజు ఆయన పర్యటన షెడ్యూల్‌లో రాజకీయ కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదని మిర్ పేర్కొన్నారు.

## సిఆర్‌పిఎఫ్ సైకిల్ ర్యాలీ ని హైదరాబాద్ నుంచి జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా కేంద్ర రిజర్వు పోలీస్ దళం(సి.ఆర్.పి.ఎఫ్)చేపట్టిన సైకిల్ ర్యాలీని ఈ రోజు తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ జెండా ఊపి హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా నుండి ప్రారంభించారు. దేశం కోసం సి.ఆర్.పి.ఎఫ్అందిస్తున్నసేవలను ఆమెఅభినందించారు.ఈ సందర్భంగా సి.ఆర్.పి.ఎఫ్అమరవీరుల కుటుంబాలను ఆమె సత్కరించారు.'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా సి.ఆర్.పి.ఎఫ్ ఏర్పాటు చేసిన ఇలాంటి కార్యక్రమాలు యువతలో దేశభక్తిని పెంపొందిస్తాయన్నారు.తెలంగాణ ప్రజలందరూ కోవిడ్ టీకా పట్ల భయం, సందేహం వీడి ముందుకు వచ్చి టీకా తీసుకొని, కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లో భాగంగా ప్రజలను జాగృతం చేసే ఉద్దేశ్యంతో కన్యాకుమారి నుండి రాజ్ కోట్ వరకు తలపెట్టిన ఈ ర్యాలీని ఆగస్టు 22వ తేదీన సి.ఆర్.పి.ఎఫ్ ప్రారంభించింది. 20 మంది సభ్యుల సి.ఆర్.పి.ఎఫ్ సైకిల్ ర్యాలీబృందానికి లెఫ్టినెంట్ కల్నల్ జస్బీర్ ప్రతాప్ శర్మ నేతృత్వం వహిస్తున్నారు. ఈ సైకిల్ ర్యాలీ ఈ రోజు హైదరాబాద్ నుంచి నాగ్ పూర్ కు బయలుదేరింది. ఈ ర్యాలీ మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్ మీదుగా అక్టోబర్ 2నాటికి రాజ్ ఘాట్ చేరుకోనుంది.చారిత్రిక స్వాతంత్ర సంగ్రామ స్థలాలు సందర్శిస్తూఈ సైకిల్ ర్యాలీ ప్రతి రోజు 70 నుంచి 80 కిలోమీటర్లు ప్రయాణిస్తూ మొత్తంగా 2850 కిలోమీటర్లు పూర్తి చేయనుంది.

ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా ప్రసాద్, ఎక్స్-డిజిపి సి.ఆర్.పి.ఎఫ్, శ్రీ మహేందర్ రెడ్డి, ఐపిఎస్, డిజిపి, తెలంగాణ; శ్రీ అంజనీ కుమార్, ఐపిఎస్ కమిషనర్ ఆఫ్ పోలీస్, హైదరాబాద్ సిటీ; శ్రీ జి.వి.హెచ్. గిరి ప్రసాద్, ఐజిపి, సి.ఆర్.పి.ఎఫ్, సౌత్ జోన్; మహేష్ చంద్ర లద్దా, ఐపిఎస్, ఐజిపి సి.ఆర్.పి.ఎఫ్, ఇంకా సి.ఆర్.పి.ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ ఆంధ్ర నాట్యం, బోనాలు జానపద నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ దొడ్డగ తెల్గామ్మల్లికి
వడ్డాది చిత్రకారుడు పాపయ్య సరయనే
'వడ్డాది' కులపు తెల్గులకు
అడ్డాగా మారినట్టి నసిపించు ధరిలైనే!!

( సెప్టెంబర్ 10 చిత్రకారుడు వడ్డాది పాపయ్య జయంతి..) -ఏ.భశ్రీ



సెల్: 9494481210




# హరిత హైడ్రోజన్ ఇంధన అన్వేషణ తక్షణావసరం

## (కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ హైడ్రోజన్ మిషన్' ఏర్పాటు యత్నాలకు స్పందనగా)

సాంప్రదాయ తరిగే శిలాజ ఇంధనాలే అధికంగా వాడిన గత చరిత్ర ప్రపంచానిది. కార్బన్ ఉద్గారాలతో శిలాజ ఇంధనాల వినియోగంతో పర్యావరణం ప్రమాదంలో పడుతోంది. కరోనా లాంటి మహావిపత్తు విజృంభించడానికి పర్యావరణ వినాశనమే ప్రధాన కారణమని తెలుస్తున్నది. శిలాజ ఇంధన ఉద్గారాల్లో కార్బన్ డై ఆక్సైడ్ లాంటి హరిత గృహ వాయువులతో భూతాపం శాపంగా మారనుందని ఐరాస సౌజన్య ఐపిసిసి నివేదిక తెలియజేస్తున్నది. నైట్రోజన్ ఆక్సైడ్‌లతో ఆమ్లవర్షం, వాయు కాలుష్యంతో ఫోటో-కెమికల్ స్మాగ్ లాంటి భయానక దుష్ప్రభావాలను అనుభవిస్తున్నాం. తరిగే శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా పర్యావరణ హిత తరగని సాంప్రదాయేతర ఇంధనాలైన సౌరశక్తి, పవనశక్తి, అలల శక్తి లాంటి రంగాలను ప్రవేశపడుతున్నాం. వాహన ఇంధనంగా విద్యుత్ యంత్రాలను తీసుకువస్తున్నాం. ద్రవ పెట్రోల్, డిజిల్ లాంటి ఇంధనాలకు బదులు స్వల్ప కాలుష్యం కలిగించగల సియన్‌జి గ్యాస్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. పర్యావరణంలో కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తూ, 2047 నాటికి భారతదేశం ఇంధన స్వావలంభన స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ హైడ్రోజన్ మిషన్' ఏర్పాటు చేస్తున్నామని మన ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందేశంలో సగర్వంగా ప్రకటించడం హర్షదాయకం.

హైడ్రోజన్‌ను భవిష్యత్తు ఇంధనంగా చూస్తున్నాం. హైడ్రోజన్ ఇంధనం మండితే సురక్షిత నీటి అణువులు విడుదల అవుతాయేగాని, ప్రమాదకర కార్బన్ డై ఆక్సైడ్ విడుదల కాకపోవడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చెప్పవచ్చు. హైడ్రోజన్ ఒక కిలోతో జనించే శక్తిని 2.8 కిలోల గ్యాసోలిన్ ఉత్పత్తి చేస్తుంది. తయారీ పద్ధతిని బట్టి హైడ్రోజన్ అణువుల్ని బ్లాక్, గ్రీన్, బ్లూ, బ్రౌన్, పింక్, గ్రే, యెల్లో, వైట్ లాంటి రకాలుగా వర్గీకరిస్తారు. హైడ్రోజన్ తయారీలో సాలీన 830 మెట్రిక్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుందని, ఇది యుకె / ఇండొనేషియ విడుదల చేసే కార్బన్ ఉద్గారానికి సమానమని గమనించాలి. ఆంథ్రసైట్ అనబడే బ్లాక్ కోల్ లేదా లిగ్నైట్ నుండి తయారు చేయబడిన బ్లాక్, బ్రౌన్ హైడ్రోజన్ ఇంధనంతో పర్యావరణంలోకి అధిక కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్, ఈథేన్ లాంటి కాలుష్యాలు వెలువడుతాయి. నాచురల్ గ్యాస్ నుంచి తయారు చేయబడిన గ్రే హైడ్రోజన్ ఇంధనం కొంత సురక్షితమని తెలుస్తున్నది.

సురక్షిత పర్యావరణ హిత హరిత హైడ్రోజన్‌ను ప్రారిశ్రామిక పరిమాణంలో ఉత్పత్తి చేయడానికి సులభ మార్గాలను అన్వేషించుట జరుగుతోంది. నీటిని విద్యుద్విశ్లేషణంలో (విద్యుచ్ఛక్తి వినియోగం) సురక్షిత హరిత హైడ్రోజన్‌తో పాటు ఆక్సీజన్ ఏర్పడుతుంది. ప్రపంచంలోనే తొలిసారి హరిత హైడ్రోజన్ వాణిజ్యపరంగా తయారు చేయడానికి రాజస్థాన్‌లో పైలెట్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడం జరిగింది.

అణుశక్తితో నీటి విద్యుద్విశ్లేషణ ప్రక్రియలో పింక్ హైడ్రోజన్, సౌరశక్తితో యెల్లో హైడ్రోజన్ ఏర్పడతాయి. హరిత హైడ్రోజన్ తయారీకి అధిక విద్యుత్ వినియోగం కావడం జరుగుతుంది. మీథేన్ పైరాలిసిస్‌లో విడుదల అయ్యే టార్క్వాయిస్ హైడ్రోజన్ ఘన కార్బన్‌ను మిగుల్చుతుంది. హైడ్రోజన్ వాణిజ్య ఉత్పత్తితో పాటు సరైన యంత్ర టెక్నాలజీని రూపొందించడం కూడా ప్రాధాన్యతను సంతరించుకున్నది. ప్రపంచవ్యాప్తంగా హరిత హైడ్రోజన్ వినియోగానికి ప్రభుత్వాలు దీర్ఘకాలిక వ్యూహాలు, అవసర పెట్టుబడులు, ధర తగ్గించే ప్రక్రియలు రూపొందించడానికి 'ఆర్ అండ్ డి'కి చేయూత, వాణిజ్య ఉత్పత్తి మార్గాలు లాంటి చర్యలు వెంటనే తీసుకోవాలి. హరిత హైడ్రోజన్ లభ్యత వాణిజ్యపరంగా సరసమైన ధరలకు అందుబాటులోకి వస్తే భవిష్యత్తు ఇంధనంగా హైడ్రోజన్ నిలుస్తుందనడం అతిశయోక్తి లేదు.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# కేసిఆర్ కుటుంబ పాలనకు ముగింపు ఆసన్నమైనది...!

## -ప్రజా సంకల్ప యాత్రలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్..!



సంగారెడ్డి,సెప్టెంబర్, 9 (నేటినిజం ప్రతినిధి ) ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం నాడు సదాశివపేట నుండి సంగారెడ్డి చేరుకున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కు అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. మార్గమధ్యంలో వివిధ గ్రామాల్లో ప్రజల సమస్యలు వింటూ వారికి అండగా ఉంటానని ఆయన భరోసా కల్పిస్తూ రైతులు, గీత కార్మికులు , ప్రజల సమస్యలు వింటూ ముందుకు సాగారు . సంగారెడ్డి అంబేద్కర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెరాస కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు మోసం చేస్తున్నాయని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఏ ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అడిగారు. రాబోయే బిజెపి ప్రభుత్వంలో తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పారు. నీళ్ల నిధులు నియామకాలు అని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం వాటికి తిలోదకాలిస్తూ ప్రజలను మభ్యపెడ్తున్నారు. కెసిఆర్ కుటు ఓంబ పాలన అంతమొందించడానికి సమయం ఆసన్నమైందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ దేశ్పాండే మాట్లాడుతూ బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర ను చూసి టిఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీనాయకుల గుండెల్లో వణుకు పుడుతుందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆయన జోస్యం పలికారు .ఈ పాదయాత్రలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, మాజీ మంత్రి బాబు మోహన్ , నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, గడిల శ్రీకాంత్ గౌడ్, గోదావరి అంజి రెడ్డి, జగన్, పవన్ పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారంలో రాజీపడటం రాజమార్గంగా భావించాలి

## -కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ

కరీంనగర్ సెప్టెంబర్ 9:(నేటినిజం ప్రతినిధి): క్షణికావేశాలు, కొందరి ఉసిగొల్పడం, తెలిసో తెలియక జరిగిన పొరపాట్ల ద్వారా వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదుకాబడి సంత్సరాలుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్న వివిధ వర్గాలకు చెందిన ప్రజలు రాజీ పడటం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ అన్నారు. రాజీ పడటం ద్వారా ఇరువర్గాలకు చెందిన వారిలో స్నేహపూర్వకమైన వాతావరణ ఏర్పడటమే కాకుండా గ్రామాల్లో శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని పేర్కొన్నారు.

న్యాయస్థానాల్లో విచారణల్లో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించడం కోసం ఈనెల 11న దేశవ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహించబడుతున్నదని, ఇరువర్గాలకు చెందిన ప్రజలు రాజీ పడటాన్ని రాజమార్గంగా భావిస్తూ తమ కేసులను పరిష్కరించుకునేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఇరువర్గాలు ఇష్టపూర్వకంగా రాజీపడి తమపై న్యాయస్థానంలో విచారణలో ఉన్న కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం ద్వారా భవిష్యత్‌లో మళ్ళీ సదరు కేసుల్లో అప్పీళ్ళు చేసుకునే అవకాశం కూడా

ఉండదని పేర్కొన్నారు. కమీషనరేట్ వ్యాప్తంగా అన్నివర్గాలకు చెందిన ప్రజల మధ్య ఉన్న కేసులు పరిష్కరింపబడటం ద్వారా స్నేహపూర్వకమైన వాతావరణం కల్పించమే లక్ష్యంగా న్యాయస్థానాలు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాయని చెప్పారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా, రాజీమార్గం ద్వారా తమ మధ్యఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు ముందుకురావడం వారి పెద్దమనస్సునకు తార్కాణంగా నిలుస్తుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరిష్కరింపజేసేందుకు పోలీస్‌స్టేషన్లకు చెందిన ఎస్‌హెచ్‌ఓలు ఇరువర్గాలను పిలిపించి వారిమధ్య సయోధ్య కుదిర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరింపజేసే విషయంలో పోలీసులు ఎలాంటి ఒత్తిళ్ళకు గురిచేయబోరని స్పష్టం చేశారు. పెండింగ్ ఉన్న కేసులను తగ్గించాలనే

ఉద్దేశంతో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగనున్నదని, ఈ సందర్భాన్ని తమకు లభించిన ఒక అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ రకాల కేసులు పెండింగ్‌లో ఉండటం ద్వారా ఆయా కేసుల్లో ఉన్న వారికి విద్య,ఉద్యోగం, పాస్‌పోర్టులు లభించడంలో కొన్ని అవాంతరాలు ఏర్పడే ప్రమాదం

ఉందని, రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలు విజయం సాధించినవారవుతారని తెలిపారు. ఈనెల 11న లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆశించినస్థాయికన్నా ఎక్కువసంఖ్యలో కేసులు పరిష్కరించబడే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు సదరు కేసులు ఇరువర్గాలు రాజీపడుతూ ముందుకువస్తున్న సందర్భాలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. **రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా పోలీస్‌శాఖ కొనసాగిస్తున్న డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారు సైతం ఈ లోక్ అదాలత్ ద్వారా తమపై ఉన్న కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని, కమీషనరేట్‌వ్యాప్తంగా 13,435 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇది ఒక సువర్ణ అవకాశంగా భావించాలని సూచించారు.**

# నారా లోకేశ్ పై మరో కేసు.. సెక్షన్లు ఏంటంటే..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9:టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేశ్ పై విజయవాడ కృష్ణలంక పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గురువారం నరసరావుపేటలో పర్యటన ఉద్రిక్తతకు దారి తీసిన సంగతి తెలిసిందే. కొన్నినెలల కిత్రం హత్యకు గురైన అనూష కుటుంబాన్ని పరామర్శించేందుకు గుంటూరు జిల్లా నరసరావుపేటకి వెళ్తున్న నారా లోకేశ్ ను పోలీసులు అడ్డుకున్నారు. గన్నవరం వచ్చిన లోకేశ్ ను పోలీసులు అడ్డుకోవడం పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో లోకేశ్ ను అదుపులోకి తీసుకున్న పోలీసులు 41ఏ సీఆర్పీసీ కింద నోటీసులు ఇచ్చి విడిచిపెట్టారు. కొవిడ్ నిబంధనల అతిక్రమణ, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించడం వంటి ఆరోపణలపై సెక్షన్ 186, 341, 269 కింద నారా లోకేశ్ పై కేసు నమోదు చేశారు.

# స్కూటీలో ఉన్న పాముని చాకచక్యంగా పట్టాడు..



హైదరాబాద్ , సెప్టెంబర్ 9:తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరిలో ఓ పాము హల్ చల్ చేసింది. నాగుపాము స్కూటీలోకి దూరడంతో వాహనదారుడు ఆందోళన చెందాడు.

అయితే వెంటనే పాములు పట్టే వ్యక్తికి కాల్ చేసి రప్పించాడు. దీంతో అతడు పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. ఆ పామును పట్టుకుంటున్న సమయంలో స్థానికులంతా తమ సెల్‌ఫోన్లకు పని చెప్పారు. ఆ దృశ్యాలను ప్రతి ఒక్కరూ చిత్రీకరించి వైరల్ చేశారు. ఈ వీడియోను ఈ వీడియోను ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్ సుశాంత నంద తన ట్విటర్ పేజీలో పోస్టు చేశారు. వర్షకాలంలో కొన్ని గెస్టులు రావడం సహజం. ఇలాంటి వాటిని ఒక పద్ధతి లేకుండా పట్టేందుకు ట్రై చేస్తే ప్రమాదం తప్పదు. పాములను పట్టేందుకు ఎప్పుడూ కూడా ట్రై చేయొద్దు అని, నైపుణ్యం గల వ్యక్తులే పాములను పట్టగలరని ఆయన ట్వీట్ చేశారు.





షాయరే తెలంగాణ, సిటీ కాలేజి పూర్వ అధ్యాపకులు,
మహాకవి మఖ్దూమ్ మొహియుద్దీన్ పేరిట నెలకొల్పిన
సిటీ కాలేజి మఖ్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డు
ప్రదానోత్సవ సభ

సమయం:
16.09.2021, గురువారం,
ఉదయం 10.30 గంటలకు

వేదిక:
గ్రేట్ హాల్, ప్రభుత్వ సిటీ కాలేజి,
హైదరాబాద్

అవార్డు గ్రహీత:
డా. యాకూబ్
ప్రముఖ కవి, విమర్శకులు

సభాధ్యక్షులు:
డా. పి. బాలభాస్కర్ గారు
ప్రిన్సిపాల్, సిటీ కాలేజి

ముఖ్య అతిథి:
ఆచార్య డి. రవీందర్ గారు
వైస్ ఛాన్స్‌లర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం

విశిష్ట అతిథి:
కె. శివారెడ్డి గారు
సుప్రసిద్ధ సాహితీవేత్త,
సరస్వతీ సమ్మాన్ పురస్కార గ్రహీత

ఆత్మీయ అతిథి:
యన్. శంకర్ గారు
ప్రముఖ సినీ దర్శకులు

నిర్వహణ:
డా. విప్లవ్‌దత్ శుక్లా, డా. కోయి కోటేశ్వరరావు
సిటీ కాలేజి మఖ్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డు కమిటీ


# ఈడీ విచారణకు హాజరైన మాస్ రాజా

హైదరాబాద్ , సెప్టెంబర్ 9:టాలీవుడ్ డ్రగ్స్ కేసు ఈడీ ముమ్మరంగా విచారిస్తోంది. ఇప్పటికే ఈ కేసులులో పలువురు సినీ తారలను విచారించిన ఈడీ.. తాజాగా ఇవాళ హీరో రవితేజను విచారిస్తోంది. గురువారం ఉదయం ఈడీ విచారణకు రవితేజ హాజరైయ్యారు. ఆయనతో పాటు కారు డ్రైవర్ శ్రీనివాస్ కూడా హాజరయ్యాడు. డ్రగ్స్ కేసులో నిధుల మళ్లింపునకు సంబంధించి ఈడీ విచారణ కొనసాగుతోంది. కెల్విన్‌తో ఆర్థిక సంబంధాలపైన ఈడీ ప్రశ్నించనుంది.

మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడు కెల్విన్ ను ఇవాళ మరోసారి ఈడీ విచారణకు హాజరుకానున్నాడు. కెల్విన్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే టాలీవుడ్ ప్రముఖులను ఈడీ అధికారులు విచారిస్తున్నారు. కాగా, డ్రగ్స్ కేసులో నిన్న హీరో రానాను ఈడీ అధికారులు విచారించారు. అంతకు ముందు డైరెక్టర్ పూరి జగన్నాధ్, హీరోయిన్స్ ఛార్మీ, రకుల్ ప్రీత్ సింగ్ హాజరైయ్యారు. ఈ కేసులో సినీరంగానికి చెందిన 12 మందికి ఈడీ నోటీసులు జారీ చేసింది. నవదీప్‌తో పాటు ఎఫ్-క్లబ్ జనరల్ మేనేజర్ 13న, ముమైత్‌ఖాన్ 15న, తనీష్ 17న, తరుణ్ 22న విచారణకు హాజరుకానున్నారు.

# కేసీఆర్ ఢిల్లీలో ఉంటే విపక్షాలకు నిద్రపట్టడం లేదు: జీవన్ రెడ్డి

హైదరాబాద్ , సెప్టెంబర్ 9:టీ.పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ను బొందపెట్టడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నం అని అన్నారు. రాజకీయాల్లో రేవంత్ రెడ్డి ఓ లిల్లీపుట్ అని వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ ఢిల్లీలో వారం రోజులు ఉంటే ప్రతిపక్షాలకు నిద్ర పట్టడం లేదన్నారు. సీఎం- పీఎంను ఎందుకు కలుస్తారో తెలియకుండా రేవంత్ రెడ్డి బక్వాజ్ మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రిని సీఎం కేసీఆర్ కలవడం ఆనవాయితీ అని తెలిపారు. గతంలోనూ చాలా మంది ముఖ్యమంత్రులు ప్రధానులను కలిశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా ప్రధాని మోదీని కలిశారన్నారు. చైనా రాయబారిని కూడా కలిశారని, మరి అది దేశద్రోహమా అని ప్రశ్నించారు.

చంద్రబాబు ప్రధానిని కలిస్తే అది ఏ బంధం అని అడిగారు. తమది ఫెవికాల్ బంధం కాదు.. ప్రజా బంధం అని స్పష్టం చేశారు. మతత్వ పార్టీలతో పొత్తులు పెట్టుకునే చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. రేవంత్ రెడ్డి.. గోబెల్స్ రేవంత్‌రెడ్డిగా మారిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజూరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి దొరకడం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డికి దమ్ము ఉంటే హుజురాబాద్ లో కాంగ్రెస్ పార్టీ



అభ్యర్థిని ప్రకటించాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే రేవంత్ రెడ్డియే స్వయంగా పోటీ చేయాలన్నారు. బండి సంజయ్ సీఎం ను తిట్టడం తప్ప- బీజేపీ ప్రణాళిక ఏంటో చెప్పడం లేదని విమర్శించారు. సంగ్రామ యాత్ర పేరుతో బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పద్ధతి మార్చుకోవాలని జీవన్ రెడ్డి సూచించారు.

